పాతగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ పాతగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ సంబురానికి శుక్రవారం ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు ఆహ్వానించారు. పారాయణికులతో మూలమంత్ర, భాగవత, రామాయణ, వేదప్రబంధ పారాయణాలను గావించారు. అనంతరం రక్షాబంధనం, పుణ్యాహవాచన కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని విశేష పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక పీఠంపై అధిష్ఠించి పూజలు చేశారు. సాయంత్రం 5గంటలకు స్వామివారి ఆలయంలో అంకురారోపణ, మృత్సంగ్రహణం వేడుకలు చేపట్టారు. తొలి పూజలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు, డీఈఓ దోర్భాల భాస్కర్‌శర్మ ప్రధానార్చకులు నల్లన్‌థీఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు, అర్చకులు, పరిచారకులు, వేద పండితులు, పారాయణికులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించనున్నారు.

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శ

సైదులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

మోత్కూరు, ఫిబ్రవరి 7 : మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయపల్లి సైదులు కుటుంబాన్ని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. సైదులు తల్లి జయమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా జయమ్మ చిత్రపటానికి కిశోర్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ధర్మేందర్‌రెడ్డి, కొండ సోంమల్లు, మల్లేశ్, అనిల్‌కుమార్, అనిత, రాధిక, ధనమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు

పటేల్‌గూడెంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని పటేల్‌గూడెంలో శుక్రవారం పంటల సాగు వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మావతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వే నెంబర్ల వారీగా సాగు వివరాలను పరిశీలించారు. ఆమె వెంట ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు శివకుమార్, స్నేహ, రైతులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ హరి ఇప్పనపల్లి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 7 : పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి అన్నారు. మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల మహాత్మ జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థులతో మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రామ చౌరస్తా నుంచి పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వాహకులు మిట్టపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో హెచ్ అండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థి లోకానికి, ప్రపంచానికి చాటి చెప్పాలన్న లక్ష్యంతో ప్రపంచ పర్యావరణ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రకృతిలోనే జీవించాలని, ప్రకృతిని సంరక్షించుకోవాలని, మానవ మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కలాం మెమోరియల్ అవార్డు, సర్టిఫికెట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్‌సాయి, స్కూల్ ప్రోగ్రాం డైరెక్టర్ ఎ.జ్యోత్స్న, కంపెనీ ప్రతినిధులు హరీశ్, వినోద్‌రెడ్డి, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు : ఎంఈఓ

సురేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్, ఫిబ్రవరి 7 : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తోందని ఎంఈఓ గురువారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పాదూరి సురేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ నర్సింగ్‌రావు, కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి, కె.శివకుమార్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'10న హైదరాబాద్‌కు తరలి రావాలి'

'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు యాదయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 7 : కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకంతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సరిపడా నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 10న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు తుమ్మల గూడెం యాదయ్య అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా గ్రామ అధ్యక్షురాలు ఆండాలు, నాయకులు లక్ష్మి, నర్సమ్మ, రాజమ్మ, మల్లమ్మ, లింగమ్మ, నాగమణి, యాదమణి పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి : కలెక్టర్

- విధులకు గైర్హాజరైన ల్యాబ్ టెక్నీషియన్‌కు షోకాజ్ నోటీస్

వీహెచ్‌సీలో రిజిష్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తాసీల్దార్ కార్యాలయంలో ధరణిని పరిశీలించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. హాజరు రిజిష్టర్‌ను పరిశీలించి మూడు రోజులుగా విధులకు హాజరు కాని ల్యాబ్ టెక్నీషియన్ టీఎస్ విలియమ్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తీరు మారకపోతే సస్పెన్షన్ చేస్తానని హెచ్చరించారు. రిజిష్టర్‌లో నమోదైనవారు ప్రైవేట్ ఆసుపత్రికి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఓపీ రిజిష్టర్‌ను తనిఖీ చేసి సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఓపీ రిజిష్టర్‌లో నమోదు చేసిన ముగ్గురి గర్భిణులకు కలెక్టర్ ఫోన్ చేసి వైద్య సేవలు అందుతున్నాయా.. ప్రైవేట్ ఆసుపత్రికి ఎందుకు వెళ్తున్నారని ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్‌కు అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలకు గేటు ఏర్పాటు చేయాలని, కోతుల బెడదతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారిని ఆదేశించారు. ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, మండల వైద్యాధికారి శ్రీవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలను మల్లాపురంలోనే నిర్మించాలి

- బీఆర్ఎస్ యూత్ నాయకుల దీక్ష
- ఎన్నికల కోడ్ ఉందంటూ దీక్షను విరమింపజేసిన పోలీసులు

మల్లాపురంలో దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ యువనజ విభాగం నాయకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 7 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యం గల వైద్య కళాశాల, 300 పడకల ఆసుపత్రిని మల్లాపురంలోనే నిర్మించాలని, వేరే చోటుకు తరలించవద్దని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మల్లాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య నేతృత్వంలో గ్రామ యువజన నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీక్షను విరమించాలని పోలీసులు కోరగా.. మధ్యాహ్నం దీక్షను విరమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండేండ్ల క్రితం మంజూరైన వైద్య కళాశాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలను తరలించేందుకు ఎమ్మెల్యే ఐలయ్య యత్నిస్తున్నాడన్న అనుమానం కలుగుతుందన్నారు. దీక్షకు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. రిలే నిరాహార దీక్ష చేసేందుకు యువకులు ముందస్తుగా పోలీసుల అనుమతి కోరారని, ఎమ్మెల్యే ఐలయ్య ఒత్తిడితోనే వారు నిరాకరించారని ఆరోపించారు. దీక్ష చేస్తే ఎమ్మెల్యేకు ఎందుకు భయంపట్టుకుందో చెప్పాలని, దీనిని బట్టి చూస్తే వైద్య కళాశాల భువనగిరి, కొడంగల్‌కు తరలిపోతుందన్న అనుమానం వస్తుందని అన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదని, వారు మల్లాపురంలో కళాశాల ఏర్పాటు చేయడం ఇష్టం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మల్లాపురంలోని ప్రభుత్వ భూమిలో శాశ్వత వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలను తరలిస్తే ఊరుకోబోమని, త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. దీక్షలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఒగ్గు మల్లేశ్, గ్రామ నాయకులు కర్రె శేఖర్, మంత్రి భిక్షపతి, మోటె రమేశ్, మోటె శేఖర్, శిఖ శ్రీనివాస్, నరేందర్, సిద్దులు, శ్రీశైలం, శ్రీధర్, రాజు, హిమామ్, కార్తీక్, రాజశేఖర్, రాజు, ప్రశాంత్, రాంబాబు పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ, నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. మండలంలోని అనాజీపురం గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ప్రజా సంఘాల బాధ్యులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ప్రజల జీవితాలకు, శ్రామిక ప్రజల బతుకుదెరువుకు శాపంగా ఉందన్నారు. ప్రభుత్వం బరితెగించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, శ్రామికులు, ఇతర ప్రజానీకం ఐక్యంగా పోరాటాలు చేయాలని సూచించారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గునుగుంట్ల శ్రీనివాస్, ఐలు జిల్లా సహాయ కార్యదర్శి బొల్లెపల్లి కుమార్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్లాపురం వెంకటేశ్, ప్రజాసంఘాల నాయకులు ఏదునూరి మల్లేశం, ఏదునూరి వెంకటేశ్, మైలారం శివ, కడారి కృష్ణ, బాలనర్సింహ, పాండు, రాజు, సత్తయ్య, నర్సింహ, దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శంకరయ్య, అయిలయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి'

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 7 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివి సాధించుకోవాలని పీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని జనగాం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లాస్ట్ మినట్ రివిజన్ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కత్తుల ఉదయ, రమాదేవి, ఎస్ఐ జగన్, ఫౌండేషన్ సభ్యులు గండికోట రాజేశ్, వెంకటేశ్వర్‌రావు, భాస్కర్ రావు పాల్గొన్నారు.

మంకీ గన్ వాడకంపై అవగాహన

మంకీ గన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

రాజాపేట, ఫిబ్రవరి 7 : హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థినులు శుక్రవారం మండల కేంద్రంలో మంకీ గన్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పంటల సమగ్ర సస్యరక్షణ చర్యలు, క్రిమికీటకాల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు స్ఫూర్తి, నజరానా, నిషిత, శ్రవంతి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులకు డప్పులు అందజేత

ఎమ్మార్పీఎస్ నాయకులకు డప్పులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్

రామన్నపేట, ఫిబ్రవరి 7 : మాదిగల రిజర్వేషన్ కోసం నిర్వహిస్తున్న ఉద్యమానికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్ శుక్రవారం పల్లివాడ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులకు 10 డప్పులు అందజేశారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కళ్లెం స్వామి 3డప్పులు బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఉంటుందన్నారు. అనంతరం వారిని ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు.

బస్సులో కండక్టర్ పుస్తెలతాడు చోరీ

బాధిత కండక్టర్ ఉమామహేశ్వరి

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 7 : విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక్టర్ మెడలోని పుస్తెలతాడును దొంగలు అపహరించుకుపోయారు. బాధిత కండక్టర్ ఉమామహేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు శుక్రవారం సాయంత్రం జనగామ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డుకు బయల్దేరింది. పెళ్లిల్లు, శుభకార్యాల నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో బస్సు ఆలేరు శివారులోకి చేరుకుంటున్న సమయంలో తన మెడలోని పుస్తెలతాడు అపహరణకు గురైనట్లు కండక్టర్ ఉమామహేశ్వరి గుర్తించారు. వెంటనే ఆలేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేసినా దొరకలేదు. పుస్తెలతాడు సుమారు మూడు తులాలు ఉంటుందని కండక్టర్ ఉమామహేశ్వరి కంటతడి పెట్టారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం దహనం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 7 : పట్టణంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. అంగడి బజార్‌లోని 5వ వార్డులో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి తగులబెట్టారు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీపల్‌పహాడ్‌లో మహిళ అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఓ మహిళ కనిపించడం లేదని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన బోదాసు హరిత(32) గురువారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో ఆమె భర్త రాము శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 7 : పట్టణంలోని కొత్త గుండ్లపల్లి, పాత గుండ్లపల్లి, బీసీ కాలనీలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేందర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కాలనీలోని పాత సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మాజీ కౌన్సిలర్ ప్రమోద్‌కు మంత్రి కోమటిరెడ్డి పరామర్శ

మోటకొండూరు : మణెమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని పదో వార్డు మాజీ కౌన్సిలర్ పోత్నాక్ ప్రమోద్‌కుమార్ భార్య రోజా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రమోద్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. రోజా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం ప్రమోద్‌కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బర్రె జహంగీర్, కొల్లూరి రాజు, ఈర పాక నర్సింహ, ప్రదీప్ పాల్గొన్నారు.

సంజీవరెడ్డి కుటుంబానికి పరామర్శ

మోటకొండూర్ : మండలంలోని చామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి తల్లి మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం మణెమ్మ దశదిన కర్మకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హాజరయ్యారు. సంజీవరెడ్డిని పరామర్శించి, మణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగపురం మల్లేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, నాయకులు సుబ్రమణ్యం, శ్రీను, చందు, జహంగీర్ పాల్గొన్నారు.

వీఆర్ కళాశాల భవనం ప్రారంభం

కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని బృందావన్ కాలనీలో నూతనంగా నిర్మించిన వీఆర్ కళాశాల భవనాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ కాలేజీ 11 సంవత్సరాలుగా ఆలేరు ప్రాంతంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక బాధ్యతలను గుర్తు చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనియమని పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అయిలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాళం అయ్యప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థి భరత్‌చంద్రకు నిత్యావసర సరుకులు పంపిన కలెక్టర్


కలెక్టర్ పంపిన నిత్యావసర సరుకులను విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి సుభాశ్

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 7 : పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించిన తలుపు తట్టే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భరత్‌చంద్ర ఇంటికి వెళ్లారు. ఆ విద్యార్థి కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన కలెక్టర్.. భరత్‌చంద్రను ఉన్నత చదువులు చదివిస్తానని, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పిన విషయం విదితమే. ఈ మేరకు కలెక్టర్ హనుమంతురావు శుక్రవారం వారికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఇద్దరు పిల్లలకు మూడు జతల బట్టలు, షూ పంపించారు. ఆ సరుకులను గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాశ్ భరత్‌చంద్ర కుటుంబ సభ్యులకు అందజేశారు. తమకు అండగా నిలబడిన కలెక్టర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని భరత్‌చంద్ర తల్లి విజయలక్ష్మి తెలిపారు.

నర్సిరెడ్డికి మరో అవకాశమివ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 7 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి సీపీఎస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్ డీఏ విడుదల చేయాలని గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులందరూ నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంఘం జిల్లా నాయకులు వెంకన్న, అరుణ, మల్లేశం, లక్ష్మి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 7 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణ కోర్సులకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిప